# చేదు నిజం

శ్రీ తాడిగిరి పోతరాజు

దినకరుడు పశ్చిమ సరిహద్దుల్లోకి పారిపోతున్నాడు, విజయవాడ పారిపోతున్న ఆంధ్ర ఉద్యోగిలా. అస్తమిస్తున్న సూర్యుని కిరణాలవెలుగు చారికలు చారికలుగా రోడ్డుపై పడుతోంది. తుఫాను ముందుండే సముద్రంలా ఊరంతా ప్రశాంతంగా గంభీరంగా ఉంది. 'చౌరస్తా' లోని కిళ్లీకొట్ల ముందు ప్రజలు గుట్టలు గుట్టలుగా ప్రోగవుతున్నారు. విద్యార్థులు ఊరేగింపుకు సమీకృతమౌతున్నారు, కరపత్రాలు పంచిపెడుతూ.

అందరి కళ్లల్లోనూ ఆవిరులు.

వారి పెదవులపై మౌనం.

ముఖాల్లో ఆందోళన—అలజడి ప్రస్ఫుటంగా కనుపిస్తున్నాయి. అందర్నీ పరిశీలనగా చూస్తూ 'చౌరస్తా' మలుపు తిరిగాడు అతను.

'ఓరి...వారీ...ఓరి...వారీ...ఎంకటిగా...ఆగు జర్ర ఆగు'. కేక వినిపించింది.

వెంకటి ఆగిపోయ్యాడు అల్లంతదూరంలో.

బిగుతుగా ఉన్న రంగులాగులు తొడుక్కున్న స్టూడెంటు పిల్లగాళ్లు వెనుకనుండి తనను త్వరత్వరగా సమీపించారు వాళ్ళకు ఎడంగా మరో ఇద్దరు వచ్చారు. ఒకరు పైజమా—లాల్చీవేసికొన్న చిన్న తరహా రాజకీయవేత్త—మరొక వ్యక్తి నెహ్రూ లాల్చీ క్రింద ధోవతి. నిత్యమూ చేతికి ప్లాస్టిక్ చేతిసంచి తగిలించుకొని తహశీల్ ఆఫీసు మొదలైన కార్యాలయాల చుట్టూ విసుగువిరామం లేకుండ తిరిగే 'పైరవికార్'. చాలా పెంపరున్న మనిషి. నల్గురూ చుట్టుముట్టారు. ప్రాణాలు పైపైనే పొయ్యాయి.

'మీ దొర ఉన్నాడ్రా...?'...మీసం మెలివేసికొంటూ అక్కడ్నించే అడిగాడు పైరవికార్.

'ఏమొ...నా కెరికనా!' వేళ్ల నములుతూన్న సమాధానం.

'ఎరిక నాంటే ఏం దన్నట్రా...నీకు ఎరిక గాకపోతె మరెవ్వరికోయ్...ఆయన దగ్గర నీవు కొలువుండటంలే?'...కోపంగా చూశాయి స్టూడెంటు కళ్ళు.

'ఇప్పుడుంట లే...గప్పుడు రెండు నెలలనాడే సాలించుకొన్నాగదా బాంచను-పైసలు పడతలుండటం లేదని మరిప్పుడు వంట ఎవరిసేత సేయించుకొంటాండో ఏమొ ...నా కెరిక లేదు'.

'ఒరె—లంగగాడిదకొడకా... ఇమానంగా జెప్పు' ప్లాస్టిక్‌సంచి అతని నెత్తిపై బెట్టాడు పైరవికార్ ప్రమాణ స్వీకారానికై.

పంచాయితీ సమితి జీపు నిండుగా ఆడవాళ్ల నెక్కించుకొని గర్భిణీ స్త్రీలా మెల్లగా కదులుతూ పోసాగింది. అనాలోచితంగా వంగి జీపుకు దణ్ణం బెట్టాడు వెంకటి—రోడ్డుప్రక్కకు దిగుతూ.

'నేను కొలువులో లేకపోతే ఆయన ముచ్చట నా కెట్ట ఎరికవుద్ది బాంచను...అరుసుకు రమ్మంటే అరుసుకొని మల్లివత్తా!...'

విద్యార్థుల ఊరేగింపు తమవైపుకు రాసాగింది. రెండు బారులుగా తీరిన విద్యార్థులు. తెల్ల బట్టపై ఎర్ర అక్షరాలు.

'జై తెలంగాణా'

దుమ్మురేపుతూ ఆవేశంగా ముందుకు కదులుతున్నాయి వాళ్ల కాళ్లూ చేతులు.

'ఆంధ్ర'...నాయకుని నినాదం.

'గో బ్యాక్'...వందలాది విద్యార్థుల ప్రతినినాదాలు.

'వీరతెలంగాణా'... మైక్‌లో కంఠం దద్దరిలుతోంది.

'వర్ధిల్లాలి'... వీథులు మార్మోగిపోతున్నాయి.

'తెలంగాణా షేర్'...'ఆంధ్రా చోర్.'

'గుంటూరు గోంకూర వెళ్లిపో'. ఆవేశమైన కేకలు - ఘట్టిగా అరుస్తూన్న కంఠాలు. విద్యార్థులు దూరంగా వెళ్లిపొయ్యారు.

'సూత్తన్నావ్ గదురా?'...మళ్లీ హెచ్చరించింది కంఠం.

గుడ్లప్పగించి విద్యార్థుల ఊరేగింపు చూస్తూన్న వెంకటిదృష్టి ఇటు మళ్లింది.

'ఇగో...వారీ...మేం మంచిగ సెబుతున్నాం. ఆంధ్రోళ్లు అందరూ బిస్తర్లు కట్టుకొని ఎల్లిపోవాలి. ఇక్కడుండకూడదు. ఇది మనదేశం... మనమే ఉండాలి. అందుకనే మంచిగ సెబుతున్నాం. మీ దొరను ముందుగనే ఎల్లమని సెబ్బు—ముందుగనే పోతే అదృష్టవంతుడు. తరువాత వాళ్లను ఒక సంపుదుకాదు. మేం ఎందుకు సెబుతున్నామో ఎరికయిందా? మీ దొర పిసగాడిదకొడుకు. బంగ్లా ఇడిసిపెట్టి ఇవతలికెల్లడు. ఊల్లో ఏం జరుగుతోందో ఏందో ఆయనకేం తెల్వదు, ఎప్పుడూ వాలుకుర్చీలో కూర్చొని ఆంగ్రేజీ పుస్తకాలు ముందేసుకొని సదవటంతప్ప......ఆఁ...తొందరగా బెజవాడ బండెక్కమను.

'నాకేం అక్కర...ఆయన ఉంటేనాకేం పోతే నాకేం'...నిర్లిప్తంగా సమాధానమిచ్చాడు కమిట్ కాకుండ.

'వారీ...నఖరాలు చెయ్యకు. నీవు ఆయన దగ్గర కొలువుజేసే సంగతి దునియా మొత్తానికి తెలుసుగానీ...పోయిసెప్పు...మల్లి ఏదైనా కిందు మీదయిందంటే లాభంలేదు'...

'సరే మనమే పోయి......తేల్చుకొందాం—అప్పటికి'...మరొక్క నిర్ణయం. విద్యార్థుల గుంపు మలుపు తిరుగుతోంది. త్వరత్వరగా అడుగులువేసి వాళ్లు నలుగురూ వాళ్లలో కలిసిపొయ్యారు. పరిశీలనగా వాళ్లకేసి చూస్తూ నిలబడి, వాళ్లు పూర్తిగా కనుమరుగైపోయింతరువాత అతను 'పాన్ డబ్బా'వైపు వెళ్లి ఒక బీడి ముట్టించాడు.

కళ్లు బెదురుబెదురుగా అనుమానంగా చూస్తున్నాయి విద్యార్థులు వెళ్లినవైపు. సంధ్య చీకట్లు వ్యాపిస్తున్నాయి. చీకటిలో ఆకారాలు కోల్పోతున్నాయి శరీరాలు. దూరదూరంగా జరిగిపోతూన్న కేకలు మెల్లగా ప్రశాంతతను దించసాగాయి 'చౌరస్తా'లో

ఒక దమ్ము బీడీలాగి వెనక్కి తిరిగాడు వెంకటి. ఎవరూ గుర్తుపట్టకుండ గల్లీలలో గోడనీడలో శరీరాన్ని దాచుకొంటూ ముందుకు పొయ్యాడు. మున్సిపాలిటీ దీపాలు వెలిగాయి. కళ్లు రెపరెప లడించుకొంటూ, పోలీసుమ చూసిన నేరస్తునిలా చీకటిలోకి తప్పుకొన్నాడు వెంకటి.

'అయ్యా'......త్వరత్వరగా వెళ్లి తలుపు తట్టాడు.

'ఎవ రదీ'...అవతల మగకంఠం బొంగురుగా సున్నితంగా.

'నేను దొరా !......ఎంకటిని...మళ్లీ వాపసొచ్చినా'......

'సరస్వతీ...తలుపుతియ్యి...' భార్యను పిలిచాడు

మెల్లగా దొంగలా లోనికొచ్చి, తన వెంటనే గడియపెట్టాడు.

'మీ కొక సిన్నముచ్చట సెప్పాలి...గిటు రండి'...తలుపు తెరచిన గృహిణికేసి సైగచేస్తూ వంట గదిలోకి నడిచాడు.

ఆమె ముఖంలో రంగులు మారాయి. ముఖం కుంచించుకు పోయింది. కొద్దిగా తెరచుకొన్న నోటితో అతన్ని అనుసరించింది.

'మీకు పొద్దుగాలే సెప్పాలనుకొన్నా...ఇప్పుడంత 'మోకా' మీది కొచ్చినట్టు కనిపిత్తాంది'...

మాటతడబడి నాలుకతడచేసికొని మళ్లీ చెప్ప సాగాడు.

'నేనిప్పుడు ఇంటి ముఖాన పోతాంటే...సదువు కొనే పిల్లగాళ్ళు...వాళ్ళు నన్ను 'సడక్'మీద నిల బెట్టి నన్ను అడిగిన్రు 'మీ దొర ఉన్నాడా పోయిండా' అని. నా కెరిక లేదని అబద్దం సెప్పినా!...మీరు జప్పున ఊరిడిసి ఎల్లాలి...లేకపోతే రోజాలుమంచిగ లెవ్వు'...తలుపుకేసి భయంభయంగా చూస్తూ మాట్లాడసాగాడు.

నోటివెంట మాటరాక నిశ్చేష్టురాలై అతని కేసి చూడసాగింది ఆమె.

'అయితే...అయితే ... మే మేంచేశామంట'— ఒక నిముషం అలానే చూసి తేరుకొని అడిగింది.

'ఏం చేసిన్రని కాదమ్మా'...అసలు ఆంధ్రోళ్లు గీడ మా దేశాన ఉండకూడదంట. ఈయాల సగలు యస్. ఇ. ఓ. ఇంటికిపోయి 'లొల్లి' చేసిన్రు. తరు వాతగా 'మూపత్తా' (తేయాకు) అమ్మే మూర్తిసాబ్ ఇంటికెల్లి బగ్గ లొల్లిసేసిన్రంట.'

'మరి పొద్దుటనుంచి చెప్పలేం...అలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చోక పోతే'...

'సెప్పాలనుకొన్నాగానీ గానీ...'సూద్దాంతియ్యి' అని 'భేసర్వా' చేసినా!'

తలుపులపై 'దభదభ' బాదిన శబ్దం. ఒక చెయ్యికాదు నాల్గయిదు చేతులు. మౌనంగా తలుపు తియ్యమని సభ్యతతో ప్రాధేయపడుతూన్న సంకేతం కాదు. తియ్యకపోతే పర్యవసానం ఊహకు అతీతంగా ఉంది. తలుపులు బాదుతూన్న శబ్దం వెనుక కేకలు, నవ్వులు. అసహ్యంగా పెద్దగొంతుతో వెకిలి మాటలు.

ముచ్చెమటలు పోశాయి ఇంట్లో వాళ్లకు.

వెనక గదుల్లో దీపాలు ఆరిపొయ్యాయి— తలుపుచాటుకు తప్పుకొంది గృహిణి. చీకటి గల్లో కలిసి పొయ్యాడు వెంకటి.

ముందు గదిలోమాత్రం దీపాలు.

ఇంటి యజమాని లేచి గడియతీసి మామూ లుగా టేబిల్ ముందు కూర్చున్నాడు. టేబిల్ పై ఓ టేబిల్‌లాంపు. చదువుతూన్న పుస్తకంలో ఏవో విషయాలు వ్రాసుకొంటూ ఆగి వస్తూన్న అతిథుల కేసి పరిశీలనగా చూడసాగాడు. తెల్లగా ప్రవాహంలా కాంతి. కాంతిలో ప్రశాంతంగా అతని ముఖం—మెరు స్తూన్న విశాలమైన నొసలు—తెల్లని లాల్చీ, పైజమా.

బిలబిలమంటూ జనంలోనికి వచ్చారు

వాళ్ళకళ్ళలోకోపం—ఛీత్కారం కనుబొమలపై నాట్యం చేస్తున్నాయి.

అతని కళ్ళలో స్నేహభావం—స్వాగతపూర్వక మైన ఆదరణ కనురెప్పలపై లాస్యం చేస్తున్నాయి.

వారి పెదవులపై ఉద్రేకం.

అతని పెదవులపై చిరునవ్వు.

అతని ముఖంలో ప్రశాంతతను చూసి ఓ క్షణం వచ్చినవాళ్లు విస్తుపొయ్యారు. 'కూర్చోండి...నాలుగే కుర్చీ లున్నాయి. మిగతా వాళ్లు ఆ చిరిచాపలు వేసి కొని కూర్చోండి ఏమనుకోక......అఁ...చెప్పండి... అందరూ ఒకేసారి వచ్చారు...ఏదో పెద్ద విశేషమే ఉండవచ్చు'...వ్రాస్తూన్న కలాన్ని గడ్డానికి ఆన్చు కొని ఆదరపూర్వకంగా అన్నాడు.

ఎవరూ కూర్చోలేదు. లాంఛనాలు పట్టించు కొనే స్థితిలో లేరు. అతను ప్రదర్శిస్తూన్న మైత్రి, ప్రేమపూర్వకమైన పలుకులు వాళ్లలో కొంత ప్రభావం చూపెట్టాయి. ఒకరి ముఖాలు ఒకరు చూసికొని కళ్లతో సైగలు చేసికొన్నారు.

'మన ఊళ్లోకూడ తెలంగాణా ఉద్యమం మొదలెట్టాం సార్...రక్షణలు పూర్తిగా అమలుపరిచే వరకూ స్ట్రయిక్ చెయ్యాలనుకొంటున్నాం. మా హైస్కూలు స్టూడెంట్స్ యూనియన్ సెక్రెటరీ సత్యాగ్రహం సేత్తాండు సార్. అందుకని మేం స్ట్రయిక్ ఫండ్ వసూలుచేత్తాన్నం సార్—ఖమ్మంలో రవీందర్ విరమించేవరకూ నడిపియ్యదలచుకొన్నాం'...

'దట్స్ గుడ్...తప్పక 'కలక్ట్' చెయ్యాలి... ఏ ఉద్యమానికైనా కొంత నిధి కావాలి...అయితే చందా వసూళ్లకోసం వచ్చారన్నమాట. ఏది ఆ చందా పుస్తకం'...అంటూ విద్యార్థి నాయకునివద్దనుండి పుస్తకం అందుకొన్నాడు.

అంతక్రుముందున్న పేర్లను వాటికి ఎదురుగా ఉన్న అంకెలను పరిశీలనగా చూశాయి కళ్లు ఓ క్షణం. కలంతీసి రెండు అంకెలు గీసి విద్యార్థి నాయకునికి అందించాడు.

'ఇంతేనా-సార్...మీరు బాగా వెయ్యాలి... అసలు ఆంధ్రోళ్లదగ్గరే ఎక్కువ కలెక్ట్ చేస్తున్నాం సార్. అందుకని మీరు ఈ ఇరవై అయిదు కొట్టే చేసి యాభై చెయ్యండి సార్. ఇక మేం పోతాం'... పుస్తకాన్ని తిరిగి అందించాడు.

'అలానా ... మంచిది' ... అంకెలు మార్చి 'యాభై' చేతిలో పెట్టాడు.

'నమస్తే సార్'...కృతజ్ఞత.

'నమస్తే'......

కృతజ్ఞతాపూర్వకంగా విద్యార్థులు చేతులు ముడిచి వెనక్కితిరిగారు ఏలాటి సంఘర్షణ లేకుండ అంత మొత్తం రాబట్టగలిగినందుకు లోలోన అభినందించుకొని సంతృప్తితో తిరుగుముఖం పట్టారు.

'జై తెలంగాణా'...విద్యార్థుల గొంతులు ప్రతిధ్వనించాయి.

'వీర తెలంగాణా.'

'వర్థిల్లాలి'...గుంపు అరచుకొంటు ముందుకు వెళ్లింది. 'మీరు మా ఉద్యమాన్ని బలపరచాలి సార్. ఇగ్గో సార్...తెలంగాణాకు జరిగిన అన్యాయాలను గూర్చి, 1956 పెద్దమనుష్యుల ఒప్పందాన్నిగూర్చి, దాన్ని అమలుపరచటంలో ప్రభుత్వ వైఫల్యాన్ని గూర్చి, మా కార్యక్రమాన్నిగూర్చి ఒక కరపత్రం వేశాం...ఇగ్గో...ఒకటి తీసికోండి'...విద్యార్థి నాయకుడు వెనక్కొచ్చి ఓ కరపత్రం అందించాడు.

'థాంక్యూ' అందుకొన్నాడు.

'పోయ్యారా...అమ్మయ్య...నా ప్రాణాలు బిగ పట్టుకొని కూర్చున్నాను సుమండీ'. ఆమె అంది తలుపు చాటునుండి ఈవలికొచ్చి.

'పిల్లవాళ్ల'కు కఠికంొక్కం 'యాభై' ఇచ్చేశారా!...అంత పెద్ద మొత్తం ఇవ్వకపోతే ఏం పోయిందీ'?...డబ్బుపట్ల ఆడవాళ్లకుండే సహజమైన జాగ్రత్త పొదుపు భావాన్ని వ్యక్తపరుస్తూ నిసురుగ్గా అంది. ఆ కంఠంలో భర్త దివాళాకోరు విధానాన్ని నిరసిస్తున్నరీతి వినిపించింది—వ్యక్తావ్యక్తంగా.

'ఏం పోయిందా?...ఇవ్వపోతే కనిపించేది... చెంబు తపేలా బయటవేసివెళ్లి పొమ్మంటే. ఇలాటి పరిస్థితులలో వారు కోరినట్లు చందావేస్తే మన మంటే గౌరవాభిమానాలుంటాయి. తొందరపడి ఏదీ చెయ్యరు. కొన్ని చోట్ల ఏం చేస్తున్నారో చూశావా? ఇరవై నాలుగుగంటల్లో వెళ్లిపోవాలని హుకుం చెలాయించటం—అలా వెళ్లిపోకపోతే ఇంటివాళ్ళను బెదిరించటం 'మీ ఇంటిలో ఉన్న ఆంధ్రా వాళ్లను పంపించెయ్యకపోతే మీ ఇల్లు తగలబెడ్తామని' బెదిరించటం. దానికి భయపడి ఆ ఇంటివాళ్లు మన వాళ్ళ తట్టాబుట్ట బయటవేసి వీథిలో నిలబెట్టటం. దానితో ఊళ్లో అందరికీ ఆంధ్రావాళ్లని తెలిసి పోయి యమయాతనలకు గురయిపోతున్నారు. వాటన్నిటిని పోల్చిచూస్తే యాభైరూపాయలతో ఇంత తేలికగా సమస్యను పరిష్కరించుకోవటం హాయిగా ఉంది. తెలుసా?' విరుచుకు పడ్డాడు అతను—గొంతును—అదుపులో పెట్టుకోటానికి ప్రయత్నిస్తూనే.

'అంతకోపమెందుకు?...ఈ పిల్లలకు అయిదో పదో ఇచ్చి ఆ మీసాలవాళ్ళ రౌడీలు ఎవరో వస్తారని నీవు చెబుతున్నాడే...వాళ్ళ చేతుల్లో ఈ పెద్ద మొత్తం ముదుపు చెల్లించుకొంటే గండం గడిచి గట్టెక్కుతామని...అంతేకానీ వేనివ్వవద్దని అనటం లేదు'...ఆమె తన అభిప్రాయాన్ని విడమర్చి చెప్పటానికి ప్రయత్నిస్తూ 'వెంకటీ...వీళ్ళుకాదుగదా నీవు చెప్పే వాళ్ళు' అనిపిలిచింది.

అప్పటిపరకూ కోళ్లపెట్టెవద్ద కూర్చుని నక్కినక్కిచూస్తూ, ఆందోళనకారులు వెళ్ళారో లేదో అని సందిగ్ధావస్థలోపడిన వెంకటి ఆమె పిలుపుతో లేచి నిటారుగా నిలబెట్టాడు—శరీరాన్ని. వెనక గదుల్లో లైట్లు వెలిగాయి.

ఆ ముఖంపై భయాందోళనలు అతికించినట్లు అలానే ఉన్నాయి. చాటుగా కూర్చోవటంవలన భయంవలన ముఖాన చిరుచెమటలు పోశాయి.

'ఈల్లు కాదు దొరా !......గీ హైస్కూలు పిల్లగాల్లతో పెద్దపంచాయితీ ఏమీలేదుగానీ గా... వాల్లు లేరు...లంగాగాడిదలు, ఆవారా బాపతు—విసాలు తిప్పకొంటా ఆంధ్రోల్ల ఇల్లకుపోయి బెదిరిత్తాన్రను. ఆంధ్రాలో మా దేశపు తాసీల్దార్ భార్యను రొమ్ములుగోసి గొసబుచ్చుకొన్నారంట. అక్కడ 'దవఖానా'లో చేర్చుకోకపోతే ఆమెను వరంగల్ దవఖానాలో చేర్పించిన్రంట ఇక్కడికి తీసి కొచ్చి. గది సూసినప్పటినుంచే గీ లొల్లి మొదలైంది.'

'చాలా భయంకరం...అయితే వాళ్ళు మనుషులు కారు—రాక్షసులు' ఆమె అసహనంతో అంది.

'వరంగల్ ఆస్పత్రిలో చేర్పించటం ఎవరైనా చూశారా?...వినటమేనా?'...

'ఏమో...ఈ పొద్దు వరంగల్ పోయివచ్చిన వాళ్ళు సెప్పిన్రు. దాంతో ఊల్లో అంతా లొల్లవుతుంది'...

'చూడకుండ పెట్టకుండ కేవలం చెప్పేడు మాటలు విని ప్రచారం చెయ్యకండి. దీనివల్ల చాలా హాని జరుగుతుంది. మంచివాళ్ళలోకూడ ప్రతీకార కాంక్ష రెచ్చిపోయి ఏదో అఘాయిత్యం చేస్తారు. గోరంతలు కొండంతలుచేసి చెప్పకోవటంవలననే ఈ ముప్పంతా. ఇక్కడ మనకేదో అయిందని అక్కడ ఆంధ్రాలో అనుకోవటం ఇక అక్కడున్న తెలంగాణా వాళ్లను, వాళ్లు హింసించటం...ఇవన్నీ'...... ఆవేశంతో ఆపివేశాడు.

అతని ముఖంపై చిరుచెమటలు పోశాయి. ఈలాటి పనికిమాలిన విషయాలపై నౌకరుతో తరచితరచి మాట్లాడటం—వాగ్వివాదం చెయ్యటం సబబుకాదని కోపంతో పెదవులులోనికి వత్తుకొని విద్యార్థులు ఇచ్చిన కరపత్రంకేసి చూడసాగాడు.

యజమాని కోపం గ్రహించి, వెంకటి నోరు మూసికొన్నాడు.

ఆమె లోనికివెళ్లింది.

నామకః కళ్లు కరపత్రంపైన ఉన్నాయికానీ ధ్యానంమాత్రం దానిపైనలేదు. పైకి ఎంత గంభీరంగా కనిపిస్తున్నా వికలమైన మనస్సు కళ్లలో తొంగిచూస్తోంది. అసహనంతో అటూ ఇటూ కదిలాడు కుర్చీలో.

మళ్లీ చదివినట్లు కరపత్రంలోకి తొంగి చూశాడు.

'జై—తెలంగాణా'...కాగితం రెండు మూలలా పెద్ద పెద్ద అక్షరాలు.

'సోదరులారా !'.........చిన్నచిన్న అక్షరాలతో నాల్గయిదు పేరాగ్రాపులలో పొందుపరచబడిన సందేశం. ఏఒక్కఅక్షరంపై కూడ కేంద్రీకరించకుండ వాక్యాల వెంట చూపులు పరుగెత్తాయి.

కరపత్రం రెండోవైపు తిప్పాడు.

విద్యార్థి సమితి కోర్కెలు: కోర్కెలు నంబరు వారిగా వ్రాయబడినవి.

1. వినియోగింపబడని తెలంగాణా నిధులను లెక్కచూడటంకోసమై ఒక కమిటీని వెంటనే నియమించాలి.

2. ముల్కీలకై ప్రత్యేకించబడిన ఉద్యోగాలలో నియమితులైన ఆంధ్రులను ఆంధ్రజిల్లాలకు వెంటనే బదిలీచెయ్యాలి.

'పోచంపాడు......స్కిప్ చేశాయి చూపులు.'

'ఈ రాత్రికి వెంకటిగాడ్ని ఇక్కడ్నే పడుకోమని చెప్పనా?' అతని దృష్టిని కరపత్రంనుండి మళ్లిస్తూ ఆమె లోనికివచ్చి అడిగింది.

'అంత అవసరం మేం లేదులే...భయపడకు. అదేపనిగా ఆలోచిస్తూ అక్కడ 'ఇలా' ఇక్కడ 'అలా' జరిగిందని కబుర్లు వింటున్నకొద్దీ మనసు వికలమై పోయి కంగారుపుడుతుంది...వెంకటీ, నీవువెళ్లు... ఏదైనా ముంచుకొస్తే నీవుమాత్రం చేసేదేముంది?... నాకేం భయంలేదులే వెళ్లు'...

లోపల గుండె భయంతో వేగంగా కొట్టుకొంటూన్నా, లేనిపోని గంభీరత పైకి తెచ్చిపెట్టుకొని తాను భయపడటంలేదని నౌకరుకు స్ఫురింపచెయ్యటానికి ప్రయత్నించ సాగాడు.

## 2

వెంకటి వెళ్ళిపోయ్యాడు. వెళ్ళబోయ్యేముందు పదే పదే జాగ్రత్తగా ఉండమని చెప్పిపోయ్యాడు. ఏదైనా జరిగితే ఏ సంకోచం లేకుండ అమ్మగార్ని తన ఇంటికి పంపమని మరీ మరీ చెప్పాడు. అమ్మగారికి ఏమీ జరగకుండ చూసే బాధ్యత తనదని హామీ ఇచ్చివెళ్ళాడు. అయినప్పటికీ తను మనసు విప్పి మాట్లాడలేదు. ఇంటి నౌకరుముందు తన నిస్సహాయతను వెళ్ళబోసికొని ప్రాణరక్షణ కోరటానికిగానీ సహాయాన్ని అర్థించటానికిగానీ తన అభిజాత్యం అడ్డువస్తోంది. తను నౌకర్ల దృష్టిలో పలుచనైపోతానేమోననే భావం పదేపదే తనను క్రుంగదీసి లేనిపోని గంభీరత ముఖంపైకి తెచ్చిపెట్టుకొన్నాడు. పైకి తను తేలిగ్గ 'ఏమీ జరుగదు లేరా' అని నవ్వి పారేసినా ఏదీ జరగదనే ఆత్మవిశ్వాసం లేదు. ఎందుకంటే పరిస్థితులు అలాంటివి.

ఇందులో పెద్దా చిన్నా తారతమ్యం లేదు—స్త్రీ పురుషుడు అన్నభేదం లేదు. సెంట్రల్ ఉద్యోగి అని రాష్ట్రప్రభుత్వ ఉద్యోగి అని విచక్షణ లేదు. ఆంధ్రా వాళ్ళంటే ఆంధ్రా వాళ్ళే.

పోనీ స్థానిక మిత్రులను ఎవ్వరినైనా నోరు విప్పి శరణుకోరదామంటే...ఎవర్నీ నమ్మటానికి వీలు లేకుండా ఉంది. మిత్రులెవ్వరో శత్రువులెవ్వరో గ్రహించలేకుండా ఉంది.

చదువుతూన్న పుస్తకాన్ని మడిచి 'ఉస్సురని' నిట్టూర్పు విడిచాడు. చుట్టూ కలయజూశాడు. కిటికీలన్నీ వేసి ఉన్నాయి. గాలి రావటం లేదు. కిటికీ తీద్దామంటే భయంగా ఉంది. సందేహిస్తూ సందేహిస్తూ, చివరకు ధైర్యంచేసి కొద్దిగా తెరిచాడు.

అవతల నరసంచారం లేదు—కిటికీ పూర్తిగా తెరచాడు.

బయట వెన్నెల - తెల్లగా, వెలా వెలా పోతూన్న ఆంధ్రుల ముఖాల్లా. ఆ వెన్నెల్లో గులాబులు, సదా బహార్ పూల మొక్కలు. సరిగా పోషణ లేక ఎండిపోతున్నాయి మొక్కలేమిటి, మనుషులే వడబడిపోతున్నారు—ఆందోళన ప్రారంభించిన నాటినుండి. అల్లంత దూరాన వీధి. పొరుగు వాళ్ళ ఇళ్లు కనిపిస్తూనే ఉన్నాయి. రోజూ చూసే పరిసరాలు—చెట్లు—ఇళ్లు—వెన్నెల. కానీ అన్నీ నిర్జీవమైన జడపదార్థాలుగా భీతావహంగా ఉన్నాయి.

తన దేశంలోనే తను ఏకాకి.

ఒక్క తన ఇల్లుమాత్రమే ఆ ఇళ్ళమధ్య వెకిలిగా ఉంది. ఆ ఇంట్లో తను తన భార్య—నిన్నమొన్నటివరకూ అందరికీ అయినవాళ్ళు. అందరూ తమను అంటు రోగుల్లా చూస్తున్నారు ఈ రోజు.

'ఏం చెయ్యటం......' కిటికీ చెక్కపై చెయ్యివేసి నిద్రాజగత్తుని పరాగ్గ పరిశీలించసాగడు

'శ్రీమతీ, భోం చేశావా?'...కనుబొమలు పైకెత్తి—ఏదో గభాలున తట్టినట్లు అడిగాడు.

'భలేవారే నే...మీరింకా భోం చెయ్యలేదు... నేనెలా భోం చేస్తాను'...ధర్మపత్ని సంప్రదాయాలను ప్రతిబింబింపచేసే చూపులతో మంచంపైనుండి ఓర చూపు చూసింది.

'భోంచేసి పడుకోకూడదూ...నా కోసం ఎదురు చూడకపోతే'...వెధవచాదస్తం నీవూనూ...ఎన్నిసార్లు చెప్పాను...సరే వడ్డించు'...కిటికీ తలుపులు వేశాడు.

అంతా స్తబ్దత......శవాన్ని పారేసివచ్చిన ఇల్లులా. 'టిక్కుటిక్కు'మంటూ కాలాన్ని తింటోంది పెద్దముల్లు. పదిగంటలు కావస్తోంది.

ఆమె కిర్రున మంచందిగి వంటగదిలోకి నడిచింది. వంటగదిలో కంచాలు కడుగుతూన్న శబ్దం. వాటిని తుడుస్తూన్న ఆమె గాజుల గలగలలు — కూరలు వడ్డించి గరిటె కంచానికి కొట్టిన చప్పుడు. చిన్నచిన్న గరిటలు విసిరిన అలికిడి.

'ఏం ...చప్పుడుకాకుండ వడ్డించకూడదా?'... అతని కంఠంలో చికాకు.

ఆమె తల బయటికి తొంగిచూసింది విస్ఫారిత నేత్రాలతో. అతను చేతులు కట్టుకొని గోడ వారగా నిలబడి చూస్తున్నాడు తనకేసి. ఎందుకని ఆమె మళ్లీ అడగలేదు. అంతే...నిశ్శబ్దంగా వడ్డన పూర్తిచేసి రమ్మని కళ్లతో సైగచేసింది.

తనకు ఆకలిగాలేదు - ఎందుకులేదు - ఏమో? కానీ తినాలి. తింటే ఒక పనయిపోతుంది. అంతటితో ఆ రోజును చరిత్రలో కలిపి రేపటికోసం ఎదురుచూస్తూ కన్ను మూయవచ్చు. దినదినగండం నూరేళ్ల ఆయుష్షు— రేపు ప్రాణాలతో లేచి మంచంపై కూర్చుంటే రేపటి బతుకు రేపు.

మౌనంగా అతను టేబిల్‌వద్దకు నడిచి డైనింగ్ టేబిల్‌పైనుండి తన కంచం, గ్లాసు తీసికొని గోడప్రక్కగా కూలబడ్డాడు తినటానికి ఉద్యమిస్తూ. తక్కిన సరంజామా అంతా క్రిందకు దింపి అతనికి ఎదురుగ్గా కూర్చుంది ఆమె.

కూర సరిగా కలుపుకోకుండ చిన్నచిన్న ముద్దలు నమలసాగాడు దిక్కులు చూస్తూ.

'మన ఇంటికికూడ వస్తారంటారా?'...... మెల్లగా రహస్యంగా అడిగింది భయవిహ్వలయై.

'.....................'

'వస్తారంటారా?'...

'రాకూడదని ఎక్కడుంది?...మనం ఆంధ్రా వాళ్లం కామా?' ముద్దతోసహ నిస్పృహను మింగుతూ అతని జవాబు. ఆమె ఉలిక్కిపడింది. కన్నుల్లో నీరు గిర్రున తిరిగింది.

'భలేవారండీ...ఇందాక వెంకటి ఇక్కడ పడుకొంటానంటే అవసరంలేదని పంపించి ఇప్పుడిలా అంటున్నారేమిటి?...ఉట్టినే అలా మంచినీళ్లు త్రాగుతారేం'. అతని కళ్లల్లో భావాలు చదవాలని వ్యర్థ ప్రయత్నం చేయసాగింది.

తల అడ్డంగా ఊపాడు...పరాగ్గా చూపులు త్రిప్పుతూ 'వాడు ఉండిమాత్రం ఏం చేస్తాడు...పైగా మనతోపాటు వాడుంటే, ఆంధ్రులకు మద్దత్తు ఇస్తున్నాడని మనతోపాటు వాడికికూడ దేహశుద్ధి మినహా...నీవు తినిరా'...తింటూతింటూ గబుక్కున లేచివెళ్లాడు.

అనాలోచితంగా పేపరు తీసికొన్నాడు—కుర్చీలో కూలబడి. పేపర్లో తను చదవని విషయాలు లేవు. ఇంగ్లీషు-తెలుగు రెండూ ప్రింటెడ్ అండ్ పబ్లిష్డ్ వరకూ కుణ్ణంగా చదివాడు. హెచ్. యస్. సి. పరీక్షకువెళ్లే విద్యార్థిలా పదేపదే బట్టీ వేశాడు. అయినా మళ్లీ విప్పాడు. విజయవాడకు చేరిన మూడువేలమంది శరణార్థుల ఫోటో.

జుట్టు రేగిపోయి అలసిపోయిన ముఖాలు.

తల్లిదండ్రుల భుజాలపై తూలిపోయిన చిన్నపిల్లలు.

కళ్ళు లోతుకు పీక్కుపోయిన వృద్ధులు'

'వరంగల్‌లో ఆంధ్రుల దుకాణాలు దగ్ధం'—

'శ్రీశైలంలో తెలంగాణా కార్మికులపై దాడి'

'మిర్యాలగూడలో ఆంధ్ర సర్వేయర్ శ్రీ రంగాచార్యులపై అఘాయిత్యం'

పదిన్నరయింది

'అయితే మనమిప్పుడేం చేద్దామంటారు. వెళ్ళిపోదామంటారా?' కంచాలు సర్ది మునిగాళ్ళపై నడుచుకొంటూవచ్చి 'టీ పాయ్' మీద అతనికి ఎదురుగ్గా కూర్చుంటూ ఆమె అడిగింది.

'అదే ఆలోచిస్తూన్నా...ఏం చేద్దామాని' అని తన కళ్లలో ప్రస్ఫుట మౌతున్న భయోద్వేగాలు భార్య గ్రహించకుండ ముఖం చాటుచేసుకొన్నాడు గడ్డం దువ్వుకొంటూ.

'ఇంకా ఆలోచిస్తున్నారా......సరేపోయింది. మీరు ఆ 'హేమ్‌లెట్'కు ఏమీ తీసిపోరు. ఎందుకు నాన్చటం...చప్పున ఏదో ఒక నిర్ణయానికి రండి. పిల్లల్ని ముందుగా పంపించటమే నయమనిపిస్తోంది... మిమ్మల్ని చూస్తోంటే'...

'మెల్లగా మాట్లాడు'...ఉన్నపళంగా విరుచుకు పడబోయి తమాయించుకొన్నాడు.

'స్త్రీ బుద్ధిః ప్రళయాంతకమ'ని ఊరికే అనాలా?...మీరు భయపడటమేకాక మగాళ్ళనుకూడ నెర్వస్ చేసేస్తారు—' మనం భయపడవచ్చుకానీ భయ పడుతున్నామని ఎదుటివాడు గుర్తించేలా ప్రవర్తించ కూడదు. తెలిసిందా? మధ్యాహ్నం వాడు వెంకటితో మాట్లాడటం వేను విన్నాను. పదే పదే ఊళ్ళో ఏం జరుగుతుందని వెధవక్యూరియాసిటీ ప్రదర్శిం చటం— మా సంగతి ఎలా? అని ప్రశ్నించటం— ఇవన్నీ చాలా తెలివి తక్కువ విషయాలు...వాడు వెళ్ళి మా అమ్మగారిలా అన్నారంటే అందరికీ లోకువై పోతాం...తెలిసిందా'? కోపంలోకూడా కంఠాన్ని అదుపులో పెట్టుకొని మెల్లగా పలికాడు.

తనకు క్యూరియాసిటీకాదని, విషయాలు ఎప్పటికప్పుడు తెలిసికొని ముందుగా జాగ్రత్తపడటం తప్పేమీకాదని వాదించాలనుకొందికానీ వాదించటానికీ, రెట్టించటానికీ ఇది సమయంకాదు తమను ఆవ హించిన విపత్కరపరిస్థితులలో భర్తకు లేనిపోని కబుర్లు చెప్పి కంగారు పెట్టకూడదని నిశ్చయించు కున్నది.

'పాపం...వాడు అలాటివాడు కాదండీ'... మామూలుగా అంది.

'అలాటివాడు కాదు వాస్తవమే...మనకు ఏదో చెడు చెయ్యాలని సంకల్పపూర్వకంగా చెయ్యక పోవచ్చు...వాడు సామాన్య మానవుడు. మా అమ్మ గారు ఇలా అన్నారని మా దొర ఇలా అన్నాడని నోరు పారేసుకొని మన ఇంటికి ముప్పుతెస్తాడు....'

'సరే లెండి...నాది తప్పే...ఇప్పుడేం చేద్దాం'

వికలమైన భర్త మనస్సును సరియైన పంథా తొక్కించాలని ప్రాధేయ పూర్వకంగా అడి గింది.

'హుష్...మాట్లాడకు......ఎవరో వస్తు న్నట్టుంది'...చలించిన అతని కంఠం. ప్రాణాలు బిగ పట్టుకొని ఇద్దరూ దోరచెవులు పెట్టుకొని విన సాగారు. ఆమె అచేతనయై పోయింది. అతను పెదవులు లోనికివత్తుకొని తలుపుకేసి నిరీక్షించసాగాడు.

గుండెపోటులా గడియారంపు వడక.

లైటుపై కొట్టుకొంటూన్న శలభపురెక్కల చప్పుడు—రోడ్డుపై వెళ్తూన్న మోటారు హారను. దూరాన కేకలు—నవ్వులు.

గుంపుగా వస్తూన్న మనుషుల పదసవ్వడి.

అతను లేచి గభాలున లైటు ఆర్పివేశాడు.

'మన ఇంటికే'...వణికిపోతూన్న ఆమె శరీరం అతని బాహువుల్లో ఇమిడిపోయింది. ఎడమచేతితో ఆమెను పొదివి పట్టుకొని వాకిలికేసి చూపు నిలిపాడు.

'ధభదభ' తలుపులు బాదిన శబ్దం.

'నీ యవ్వ నిద్రబోయినట్టుంది......లేపు దామా?'...ఒక కంఠం సందేహం.

'నిద్రపడతందాంట జనానికి...ఇంకా నిద్ర లెక్కడ'...వెకిలినవ్వు.

'సరేలే...ఈ అర్ధరాత్రి ఎక్కడకు పోతారు. రేపు పొద్దున తేల్చేద్దాం. ప్రస్తుతానికి పని కానిద్దాం'— ఓ జాలిహృదయం వాయిదా వేసింది. ఇష్టమొచ్చినట్లు నోరు పారేసుకొంటూ బండ బూతులు తిడుతూ, నవ్వుతూ పేలుతూ గుమ్మానికి ఎదురుగా చతికిలబడ్డారు.

రంగుడబ్బాల మోత—బ్రష్‌తో తలుపులపై ఏదో వ్రాస్తూన్న శబ్దం.

'టార్చిలైటు సరిగా వెయ్యరా?'...'అక్కడ ఉద్యోగాలు దొరక్క తిండిలేక ఇంతదూరం వచ్చి కూడ నఖరాలు......ఆంగ్రేజీ వీళ్ళకే వచ్చినట్లు ఒలంపరు'...వ్రాస్తూన్న బర్‌బర్ శబ్దానికి వ్యాఖ్యా నిస్తూన్నది మరొక కంఠం.

'ఆంధ్రా...గో...బ్యాక్'

'ఆంధ్రా కుక్కలను తరిమికొట్టండి' వ్రాస్తూన్న కంఠం అక్షరాలను విడివిడిగా ఉచ్చ

రిస్తూ పూర్తి చేయసాగింది. ఎన్నో బూతుమాటలు.

'పోదాం పద్రని...' 'ఇంకా వ్రాయాల్సిన ఇళ్లు చాలా ఉన్నాయి.' పదకొండుగొట్టినా వడిసేటట్టు లెవ్వురా-రాములూ'. నాయకుని కంఠం పలుకు తూనే దూరం కాసాగింది, అతన్ని అనుసరిస్తూన్న పరివారం.

అడుగుల శబ్దం దూరమైపోయింది.

కోలాహలం వినిపించకుండా పోయింది.

ప్రాణాలు కుదుటపడ్డాయి, అయినా కంగారు తగ్గలేదు ఇద్దరికీ. ఇంకా బయట ఎవరో తనకోసం పొంచిఉన్న అనుభూతి ఉండటంవలన మాట పలుకు లేకుండ అలానే నిలబడిపోయ్యారు. ఆమె శరీరం భయంతో కంపించి చిరుచెమట్లు పోయటంవలన అతని చేతికి చల్లగా స్పర్శ తగులసాగింది.

'పో—య్యా—రు—లే' స్వగతంగా పలికినట్లు మెల్లగా ఉచ్చరించి తన భార్యను గట్టిగా పట్టు కొన్న చేతిని సడలించాడు.

'మనం ఇక్కడ ఉండడం ప్రమాదమండీ... ఈ పాటికి మనం వెళ్ళిపోవాల్సింది. గభాలున ఏదైనా జరిగితే చేసేదేమీ లేదు...మన కిక్కడ అయిన వాళ్లు పోయినవాళ్లు ఎవరున్నారు?... ఈవేళకు మనల్ని ఒదిలిపెట్టటం మన అదృష్టమనుకో వాలి......వెళ్లిపోదాం'......సన్నని రోదన వినిపించింది.

'సరస్వతీ......ఏడవకు......నేను ఉండాలని మూర్ఖంగా కూర్చోలేదు. సమయంకోసం ఎదురు చూస్తున్నాను. వెళ్లదలచుకొంటే మనం ఒక్క వారం రోజులనాడే వెళ్లాల్సింది. ఇప్పుడు పరిస్థితి చాలా ఉధృతంగా ఉంది. మనం కాజీపేట వెళ్లేలోగా ఈ బస్సు ఆరు గ్రామాలు దాటాలి. బస్సులో మనం మాట్లాడే విధానం కనిపెట్టి ఆంధ్రావాళ్లు పారిపోతున్నారని మనలను హింసించవచ్చు. అందువలన పగలు పారిపోవటం ఈ పరిస్థితుల్లో శ్రేయస్కరం కాదు...రాత్రి ఎనిమిది దాటినతరువాత...కానీ ఇల్లు కదలాలంటే భయంగా ఉంది. ఏంచేద్దామనే ఆలో చిస్తున్నాను'...తనలో తాను మాట్లాడుకొంటూ న్నట్లు పలికి మౌనంగా ఆలోచించసాగాడు.

ఈ పరిస్థితుల్లో ఒంటరిగా తను ఏంచెయ్య గలడు? పోలీసులను సహాయంగా పిలిపించుకొంటే — బాగానే ఉంటుంది — ధైర్యంగా నిద్రపోవచ్చు — కానీ భయపడిపోయినట్లయిపోతుంది — పోలీసు కాపలా పెట్టు కొంటే నలుగ్గురూ తనని పిరికివాడనుకొంటారు... అనుకుంటే అనుకొన్నారులే — ప్రాణంమీద కొచ్చిం తరువాత చేసేదేముంది?... కానీ వాళ్లనీ నమ్మ టానికి వీలులేదు...వాళ్ల సమక్షంలోనే ఎన్నో దురా గతాలు జరిగాయి.........అయినా ఈ అర్ధరాత్రి ఒంటరిగా పోలీసుస్టేషన్‌వరకూ వెళ్లటం శ్రేయ స్కరంకాదు. ప్రతి 'చౌరస్తా'లోనూ చిన్నచిన్న 'టీ' దుకాణాల్లోనూ చర్చలు సమావేశాలు జరుగు తూంటాయి...ఎవరైనాసరే — మెల్లగా నడిచే తన నడకను, మోకాళ్లవరకు వేలాడే లాల్చీలను, సువిశాలమైన పైజమాలను ఇట్టే గుర్తుపట్ట గలరు.

'చ్చ్' లాభంలేదు.

'అయితే మనం ఒకపని చేద్దాం. మనం వెళ్లి పోయినట్టు బయటవాకిలికి తాళం వేసివస్తాను.' తడబడుతూన్న నాలుకతో నంగినంగిగా మాట్లాడింది.

'నాకు నిప్పుకోడి జ్ఞాపకం వస్తోంది. అపాయం సంభవించినప్పుడు ఇసుకలో తల దూర్చి ప్రాణా పాయం తప్పిపోయిందనుకొంటుందట...అలా ఉంది నీ వ్యవహారం......లే...అడ్డంలే...లైటు వేస్తాను'... మెల్లగా స్విచ్ క్రిందకులాగాడు. అయినా అది టక్కుమన్నది వాళ్లను భయపెడ్తూ. లైటు వెలిగాక బయట మళ్లీ ఏదైనా సంచలనం విని పిస్తుందేమోనని సంశయిస్తూ ఓ నిముషం ఎక్కడి వాళ్లు అక్కడే నిలబడిపొయ్యారు, చెవులు రిక్కించి.

అంతా నిశ్శబ్దం.

బయటమనిషి మెసిలిన అలికిడిలేదు.

ఇద్దరూ దీర్ఘంగా శ్వాస విడిచారు. ఆవ హించిన వెలుతురు కొంతకొంత ధైర్యాన్ని నింపింది. లైటు ఆర్పివేసినప్పుడున్న వణుకు, తత్తరపాటు కొంత తగ్గుముఖం పట్టాయి.

వంగి అగ్గిపెట్టె అందుకొన్నాడు. అగ్గిపుల్ల గీసి పెదవులదగ్గరగా తీసికొన్నాడు. నోటిలో సిగరెట్టులేదు. కనురెప్పలు టపటప కొట్టుకొన్నాయి. తిరిగి సిగరెట్టుపెట్టె అందుకొంది చెయ్యి. మనస్సు వికలమైపోయిందనుకోటానికి ఇది ప్రత్యేక నిదర్శనం. బుద్ధిని అదుపులో పెట్టాలి. ధైర్యం చెడిపోతే బుద్ధి చాలా పిచ్చిపిచ్చిపనులు చేస్తుంది. కాబట్టి మనసు పూర్తిగా నీరుకారిపోక ముందే కర్తవ్యం ఆలోచించాలి.

సిగరెట్టు తగలబడుతోంది పెదవుల మధ్య.

ఆలోచనలసెగళ్లతో మనస్సు దగ్ధవౌతోంది.

నుసి గుండ్రని ఉండలు ఉండలుగా లాల్చీపై రాలుతోంది విరిగిపోతూన్న నిష్ప్రయోజనమైన ఆలోచనల్లా.

ఖాళీ సిగిరెట్టుపెట్టెను ముక్కలు ముక్కలుగా చించుతూ ఆమె దిక్కుతోచని స్థితిలో కూలబడింది అతనికి ఎదురుగ్గా.

'ఏది ఎలా ఉన్నా...తెల్లవారేసరికి ఊరుదాటి వెళ్లాలి...తొందరగా సర్దుకొని తెములు...ఏదైనా లారీలో వెళ్లిపోదాం'...కనుబొమలు పైకెత్తాడు ఒక నిశ్చయానికొచ్చినట్లు.

'మళ్లీ వస్తాంకదా?'...బెడ్‌రూమ్‌లోకి వెళ్లిన ఆమె మళ్లీ అడిగింది.

'ఏమో పరిస్థితులు చక్కబడినతరువాత విషయం...ఇంతలో చక్కబడతాయన్న నమ్మకం లేదు.'...అంటూనే ఓ నిముషంలో బట్టలు మార్చుకొని కుర్చీలో కూలబడ్డాడు ఇంటిని కలయజూస్తూ. ఏది వెంట తీసికువెళ్లాలో ఏది వదిలివెయ్యాలో పాలుపోవటంలేదు. అన్నీ అతిముఖ్యంగానూ ప్రీతికరంగానూ కనిపించాయి.

అందమైన అర్ధవృత్తాకారపు బుక్‌షెల్ఫ్—దానినిండా విలువైన పుస్తకాలు దానివెనక ముక్కాలిపీటపై విద్యుద్దీపపుబొమ్మ.

అది గ్రీకు పాలరాతి శిల్పానికి అనుకృతి. అర్ధనగ్నంగాఉన్న గ్రీకు సౌందర్యదేవత. తీర్చిదిద్దిన అంగసౌష్టవం. అలవోకగా ఒక దీపస్తంభానికి ఆనుకొని తన ఉదరభాగంపైకి ఉల్లిపొరలాటి ఉడుపులు లాక్కుంటూన్న స్త్రీమూర్తి. ఆమె ఆనుకొన్న స్తంభంపైన మిల్కుబల్బు. తెల్లని ఆ దీపపుకాంతిలో మరింత శోభయమానంగా మెరిసిపోతోంది ఆ గ్రీకు పడతి.

దానికి ఎదురుగ్గా నల్లని రోజ్‌వుడ్ చెక్కపై కొంగలు.

నల్లనికొమ్ముకొంగలజంట విషాదంగా మెడలు పైకెత్తుకొని పైకి చూస్తున్నాయి.

కుర్చీ ముందుకు లాక్కొని బూట్లు అందుకొన్నాడు. సాక్స్ విడిచి కాళ్లకు తొడుక్కొంటూ కిటికీలవైపు చూశాడు.

'ఒమర్ ఖయ్యాం'...బొమ్మ.

ఖయ్యాం కౌగిలిలో ఒదిగిపోయిన సాకీ—ఆమె చేతిలో మధుకలశం. మధువు నింపిన కలశాన్ని ఖయ్యాంకు అందిస్తోంది. చెంతనే తన కిష్టమైన కావ్యం. చెట్టునీడలో ఒకరి కౌగిలిలో మరొకరు.

'మధువు—కావ్యం—నీవున్న స్థలం స్వర్గసీమకానీ వనసీమకాదు' అని ఖయ్యాం చెప్పిన రుబాయత్‌కు రూపకల్పనచేసిన కళాఖండం.

ఎటు చూసినా అమూల్యమైన కళాసంపత్తి.

తనను ప్రస్తుతం ఆవహించిన పరిస్థితులను ఒక్కక్షణకాలం విస్మరించి, తాను జీవితంలో కూర్చుకొన్న కళాసంపత్తివైపు చూపులు పరుగెత్తించుతూ గడిపాడు. 'వెళదాం...పదండి'......ఆమె బయటికొచ్చింది—మెడచుట్టూ పమిట కప్పుకొంటూ. చేతిలో చిన్నప్లాస్టిక్ బ్యాగ్ వేలాడుతోంది — బట్టలు వగైరాలతో.

'బంగారం వెంటతెచ్చుకొంటున్నావా?'...... అడిగాడు మెడ కప్పుకొన్న విధానాన్ని అవలోకిస్తూ.

అవునన్నట్టు తల ఊపింది.

ఓ క్షణకాలం పెదవిపై చిటికెనవ్రేలు వేసికొని ఆలోచించాడు.

'మనం ఏ పేరంటానికో పబ్బానికో వెళ్ళటం లేదు. అసాధారణమైన పరిస్థితుల్లో ఇల్లు వదిలి వెళుతున్నాం. అందులోనూ రాత్రి. మెడలో గొలుసులు—చేతికున్న గడియారపుగాజు మొదలైనవి ఎంతటివాడినైనా ప్రలోభ పెడతాయి......ఎవరికైనా డబ్బు బంగారంచూస్తే ఆశ. ఇవన్నీ వేసికొని వాళ్లను 'టెమ్ప్ట్' చేసేదానికన్నా సురక్షితంగా పెట్టెలో దాచుకో. నేనుకూడ ఏమీ తెచ్చుకోవటం లేదు.......

...మరొక్క విషయం.

మనం లారీవాళ్ళతోకానీ ఎవరితోనైనాకానీ మాట్లాడవలసివస్తే 'అవునండీ – కాదండీ' – 'అలా–ఇలా' అని దీర్ఘాలుతీస్తూ మాట్లాడకూడదు. 'గటు—గిటు—అచ్చిందు—పోయిందు—నా కెరికలేదు.' మొదలైన మాటలు మాట్లాడుతూంటే ఎవరికీ అనుమానముండదు...'ఇప్పటి కిప్పుడు అలా మాట్లాడటం ఎలానండీ' అనికదూ నీ భయం - అదీ నిజమే. అందువలన నోరు మూసుకొనిపడిఉండు. అది అన్నిటికన్నా మేలు. నోరు కదిలిస్తే మాత్రం చాలా జాగ్రత్తగా ఉండాలి.

సరేనని తల ఊగించి లోనికివెళ్ళింది.

మెడపై బంగారుతొడుగులుతీసి పెట్టెలో పదిలంగా దాచింది. ప్లాస్టిక్ బ్యాగ్‌లో దాచిన విలువైన ఆభరణాలు డబ్బు మళ్ళీ పెట్టె అడుక్కు వెళ్ళిపొయ్యాయి. చీరె మార్చుకొని మామూలువాడకం చీరెతో బయటికొచ్చింది.

అతను తాళాలు తీసికొని ఆమె రాకకై అసహనంతో నిలబడిపొయ్యాడు ఇద్దరూ వెళ్ళిపోవటమే తరువాయి అన్నట్టు తలలు ఊపి కళ్ళతో సైగ చేసికొన్నారు.

బెడ్‌రూమ్ తాళంవేసి వీధిగుమ్మం చేరారు.

బయట ఎవరైనా ఉన్నారేమోనని అమమానంగా ఆగారు ఒక క్షణం. నిశ్చలంగా ఉంది. గడియారంలో చిన్నముల్లు - పెద్దముల్లు—పన్నెండుపై పోటీ పడుతున్నాయి.

కాలం స్తంభించింది.

'టక్'మని స్విచ్ పైకి వెళ్ళింది-మళ్ళీ చీకటి-మళ్ళీ భయం.

'క్లిక్'మని బోల్టు జారింది. వీధి తలుపులు తెరచుకొన్నాయి అడుగు బయటికివేశారు.

చైతన్య రహితమైన ప్రకృతి. స్తబ్దత ఆవహించిన పరిసరాలు. ఇప్పటివరకూ వెలుగును చూసిన కళ్లు చీకటిలోకి చూడలేక తచ్చాడుతున్నాయి. చీకటి క్రీనీడలలో ఏవో ఆకారాలను పోల్చుకొని భయంభయంగా చూశారు. మనిషి చెట్టుచాటుకు వంగి నిలబడిన అనుభూతి. పొరుగింటి మారుమూల ఎవరో ప్రక్కకు తప్పుకొన్న సందేహం. కదిలిన నీడలను పోల్చుకొంటూ, నిర్ధారణ చేసికొంటూ రెండు నిమిషాలు గడిపారు.

కళ్ళపై వెలుగు ప్రభావం తగ్గి క్రమేపి అవి చీకటిని చీల్చసాగాయి. సడీచప్పుడూ లేవు. చీకటిని నమ్మి ముందుకుపోవటం మినహా మరో శరణ్యంలేదు. దూరంగా వీధుల్లోకి వాటిమారుమూలల్లోకి తొంగిచూస్తున్న చూపులు కుంచించుకొని క్రిందకుచూస్తూ మరొక అడుగు వెయ్యబొయ్యారు

ఎదురుగా నల్లని ఆకారం—ముద్దలా దారికి అడ్డంగా ఉంది.

ఉలిక్కిపడ్డారు — రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

'మ్యావ్'...మంది ఆకారం నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

'పిల్లి శకునం బాగాలేదండీ...ముదనష్టపు పిల్లి—మనకోసమే కూర్చున్నట్లుంది బొడ్డుదేవరలా.

ఈ రాత్రికి ఇక్కడే ఉండి రేపు పోదామండీ—రండీ—నా మాట వినీ' పీడిస్తూ అర్థించసాగింది.

తన కాలంటి నమ్మకాలు లేవు. జన్మ నక్షత్రాలు-వర్జ్యాలు తుమ్ములు-దగ్గులు అంటే తనకు విశ్వాసంలేదు. అందులోనూ పిల్లి—కుక్క శకునాలు అసలే గిట్టవు—మామూలు పరిస్థితులయితే తను ఎదురుచెప్పి వెళ్లిపోవును. కానీ అసలే అంతర్గతమైన భీతితో కంపించిపోవటంవలన, పిల్లికూతతో రోమాంచితమైన శరీరంలో రక్తం ఉధృతంగా ప్రవహించటంవలన ఆమె మాటకు ఎదురుచెప్పలేదు. 'బయటికి వెళ్లటం ప్రమాదమని సూచిస్తోందో లేక ఇంట్లోఉంటే హానికరమని వారిస్తోందో' అని ఆలోచిస్తూ భార్యతో లోనికి వెళ్లాడు.

ఆమె దొడ్డివాకిలి తెరచింది.

'వీధి'వాకిలికీ యధాతంతగా తాళంవేసి భర్త చేతిలో పెట్టింది. అతనిని మారుమాట్లాడనివ్వక దొడ్డివాకిలిగుండా లోనికి నడిపించుకెళ్లింది. జీవన్మరణాలమధ్య ఊగిసలాడుతూ ఇద్దరూ చీకటిలో ఒత్తిగిల్లారు.

## 3

ఆ మరుసటిరోజు.

'ఆంధ్రా గో బ్యాక్' ఉద్యమం పరాకాష్ఠనందుకొంది. ఎనిమిదిగంట లయ్యేప్పటికి ఆ పట్టణంలో పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. దేశభక్తి ఆధారంగా, విద్యార్థుల ఆలజడిని ఆసరాగా తీసుకొని నాటురకం రాజకీయవేత్తలు, పనీపాటలేనివాళ్లు—ఫైరవికార్లు మొదలైనవాళ్లందరూ 'చౌరస్తా'లో పోగయ్యారు. గుండాలు—రౌడీలు వాళ్లలోచేరి పదేపదే నినాదాలు దువ్వకోసాగారు. ఆంధ్రుల అసహనతను గూర్చి వారి ఆస్తిపాస్తుల వివరాలనుగూర్చి చర్చలు సుదీర్ఘంగా కొనసాగుతున్నాయి బాగుపడ్డ ఆంధ్రా కుటుంబాలనుగూర్చి—ఎన్నోసంవత్సరాలుగా గుండెల్లో మురిగిపోతూన్న అసూయద్వేషాలను నిరాఘాటంగా చెప్పుకుపోతున్నాడొక నోరుగల పెద్దమనిషి. 'రజాకార్' ఉద్యమంలో పాకిస్తాన్ పారిపోయిన నవాబుల ఆస్తిపాస్తులను కైంకర్యం చేసికొని గొప్పవాళ్లయి సమాజంలో నాయకులుగా చెలామణి అవుతూన్న పెద్దమనుషులు ఈ ఉద్యమ కారణంగా ఆకస్మికంగా తమను వరించబోయే సిరినిగూర్చి కలలు గంటున్నారు. నిలబడి ఆంధ్ర ఉద్యోగస్థులు చేసిన అన్యాయాలకు, వ్యక్తిగతమైన స్పర్థలకు—ప్రతీకారం తీర్చుకొనే అవకాశం ఆసన్నమైనందుకు మురిసిపోతూ ఈ గుంపును ఎటు మళ్లించాలాని ఆలోచిస్తున్నారు కొందరు ప్రభుత్వ సేవకులు. పగలంతా కష్టపడినా, పొట్టగడవని రిక్షావాళ్లు—హోటల్ వర్కర్స్ మొదలైన శ్రామికులు.

ఆంధ్రుల ఇళ్లు ఈటుబోతే ఏదైనా విలువైన వస్తువు చేతికిదొరికితే, పదిరోజులపాటు పనీపాటా తప్పుతాయని ఆరాటపడుతున్నారు.

'గిదొక లెక్కానయ్యా...వరంగల్‌లో సూడనుంట్రిటి. ఆంధ్రోల్ల దుకానాలను కాలబెడ్తాంటే పోలీసోల్లు గిట్టనే నిలబడి సూతాన్రు. (అభినయించాడు).ఆంధ్రోల్ల నందరినీ ఎక్కడిదొరికినోల్లను అడ బగ్గసంపి ఆయంత అందర్నీ సాయంత్రం బెజవాడ బండి ఎక్కించిన్రు ... ఇక మళ్లీ వాపసు రావటమా...గప్పుడు పాకిస్తాన్‌కు పోయినవాళ్లు మళ్లీ వాపసొచ్చిన్రే ...గీ వీళ్లు అంతే... ఛలో... నీయవ్వ—సోచాయించుడేంది?'

అచంచలంగా పేరుకొన్న మురుగుకాలువలో చెత్తా చెదారాన్ని కర్రతో చిన్నగా కదిలించినప్పుడు ముక్కులుపగిలె దుర్గంధంతో ముందుకు కదిలే ప్రవాహంలా అందరూ ఒక్కసారి కదిలారు—ఆ హెచ్చరికతో.

'ఇళ్లల్లో దూరి వాల్లను బయటికి ఎగ్గకు రావాలి. దాంతోపాటే వాళ్ల సామాన్లు ముల్లెకట్టి బసెక్కిచ్చాలి'......ఫైరవికార్ ఆంధ్ర ఉద్యోగుల 'లిస్టు' చూసుకొంటూ అన్నాడు.

విస్ఫారితనేత్రాలతో ఊరేగింపుగా వెళ్తూన్న జనసమూహంకేసి నోరు తెరచుకొని చూశాడు వెంకటి. శరీరం చల్లబడింది. చెమట్లు కక్కు కొంటూ పెద్దపెద్ద అంగలతో గొందులూ సందులూ దాటి యజమాని ఇంటికి వెళ్లాడు.

ఇంటికి తాళంవేసిఉంది.

ఒక్క క్షణకాలం మనస్సు కుదుటపడింది. వెంటనే ఏదో సందేహం మనస్సును పీడించసాగింది. అటూ ఇటూ పరీక్షగా చూసి తాళం పట్టుకులాగి ప్రక్కఇంటివాళ్లను అడిగాడు.

'అమ్మా...మా దొర...పోయిండమ్మా'...... గుటకమింగాడు

'ఏమోరా...నా కెరికలేదు ఈయల అంత మబ్బులోనే వచ్చింది మా సాకలి పనివెయ్యటానికి. గప్పటినుంచి సూత్తన్నా......ఇంట్లో సప్పుడులేదా మానుకొంటున్నా.........తలుపులు బందుజేసికొని పోయిన్రా'...ఆమె ఆశ్చర్యంగా అంది.

ఆ సమాధానంతో అతను సంతృప్తి చెంద లేదు.

'నేనెవరితోనూ సెప్పన్లే...నాకు సెప్పండి... ఇప్పుడందరూగా బి డి ఓ ఇంటిముఖాన పోతాన్రు. ఒక అరగంటలో గిటొత్తారు ..గింతలోనే దొంను దొరసానినీ మా ఇంటికి తోలకపోయి దాసిపెడ్త. రాత్రి సీకట్లో కాజీపేట తోలిద్దాం. గక్కడనుండి గాడ్డీకి బెజవాడ పోతారు'......

'నేనింట్లో దాసి అబద్దం సెబుతున్నాననుకొన్నావ్రా......పిసగాడిద—చూసుకో నీకు అడ్డమేముంది?'......నీవు నన్నడిగేదాకా నా కెరికలేదు. ఎటుపోయిన్రో ఏందో'......

ఆ సమాధానంతో అతని మనస్సు మరింత నీరసపడిపోయింది.

అయిదు నిముషాలు అలానే కూర్చుండి పొయ్యాడు ఏమీ పాలుపోలేదు. మెల్లగా లేచి దొడ్డివాకిలివైపుగా వెళ్లి ప్రహరీగోడపైనుండి ఆవరణలోకి దిగి చరచరా వంటగదివైపు నడిచి తలుపు తట్టసాగాడు.

'అమ్మా...ఓ అమ్మా...తలుపు తియ్యండి... అమ్మా...నేను ఎంకటిని...నా మాట నమ్మండి... ఇప్పుడెవరూ లేరు...అమ్మా......అమ్మా'......తలుపు తడుతూ తలుపుల సందుల్లోనుండి మూతిపెట్టి పిలువసాగాడు.

ఆవతలనుండి సమాధానంకోసం నిరీక్షిస్తూ కొద్దిసేపు ఆగాడు.

మళ్లీ తట్టాడు—మళ్లీ పిలిచాడు

ప్రజాసమూహం వస్తుందేమోనన్న భయం కొద్దీ వెనక్కి నడిచి ప్రహరీగోడ పైనుండి నిక్కి వీధుల్లోకి చూసి గుండె నిబ్బరం చేసుకొని మళ్లీ బెడ్‌రూమ్‌వైపు నడిచాడు.

'అమ్మా'......

'దొరా!......వాల్లందరూ వచ్చేత్తాన్రు... బయటికిరండి దొరా! తాలాలు పగలగొట్టిసూతాన్రు. నిన్న మీకు తాలాలు ఏసుకొని ఇంట్లో ఉండమని సెప్పాగనీ ఇప్పుడిక ఫాయిదాలేదు...అమ్మా...నేను ఎంకటిని...తియ్యకపోతే కొద్దిగా కిటికీ తెరిచి నాతో పలకండి...అమ్మా...అమ్మా...' కిటికీ తలుపులు వెనక్కి ముందుకు కదిలించాడు.

ప్రతికిటికీవద్దకు వెళ్లి పిలిచాడు.

బతిమాలాడు. లాభం లేకపోయింది

అంతలోనే కోలాహలం—బిగ్గరగా కేకలు—ఈలలు—అరుపులు—వీధి మలుపులో మేఘంలా దుమ్ము. దుమ్ములో కలిసిపోతూన్న మానవుల గుంపు. గోడ దూకి ప్రక్కకు తప్పుకున్నాడు.

'హే'—అని అరుస్తూ మూక ఇంటిపైకి ఎగబడింది.

'నీయవ్వ...తాలాలేసుకొని ఇంట్లోదాక్కుంటే లంగగాడిద కొడుకుల్లారా! నిన్నిప్పుడు బయటకు ఎగ్గుకు రాకపోతే మేం మా అవ్వ బాపులకు పుట్ట లేదనుకో'...ఒకడు గడపలుగుతో తాళాన్ని బలంగా వంచసాగాడు.

వెంకటి వెనక వెనగ్గా నడిచి ఆందోళనకారుల్లో కలిసిపొయ్యాడు. మిగతా వాళ్ల గుంపులు

గుంపులుగా కిటికీల చెంతచేరి 'బయటికి రమ్మంటూ' తలుపు చెక్కలు బాదసాగారు కొందరు రాళ్ళు రువ్వసాగారు. కొందరు ప్రేక్షకుల్లా చూస్తున్నారు—

తాళం భళ్ళున విట్టి క్రిందపడిపోయింది.

వెంకటి గుండె పగిలిపోయింది.

ఒక్క తన్నుతో తలుపులు రెండుగా తెరచుకొన్నాయి - స్వాగతం పలుకుతూ. బిలబిలమంటూ అందరూ లోనికి చొరబడ్డారు. మరుక్షణంలో భార్యా భర్తలిద్దరినీ జుట్టుపట్టి బయటి కీడ్చుకొస్తారని భయాందోళనలతో శరీరం చిరుచెమటలు కమ్మాయి వెంకటికి. తలుపుల మూలల్లోకి మంచాల క్రింద భాగాల్లోకి గుచ్చిగుచ్చి చూశాడు. మనుషులు లేరు.

మనస్సు కుదుటపడి దీర్ఘంగా నిట్టూర్చాడు.

అద్దంలా అమర్చిఉన్న ఇల్లు—ఒక్కక్షణంలో వికృతరూపం దాల్చింది. గోడలపై అమర్చినబొమ్మలు—చిత్రాలు భళ్ళున పగిలాయి పెట్టెలు పగలకొట్టి ఎవరికి అందిన బట్టలు వాళ్ళు పోటీలుపడి లాక్కుపోసాగారు. కొందరు బియ్యం పప్పులు మూటలుకట్టుకొని దొడ్డి వాకిలినుండి నిష్క్రమించారు. అన్నంతినే కంచాలు—బిందెలు—వంటపాత్రలు—గొడుగు—లాంతరు—చెప్పులు - ఎవరికందినవి వారు పుచ్చుకొని ఎటు వాళ్లటు తోసికొంటూ, నవ్వుకొంటూ పరుగెత్తసాగారు. ఇవన్నీ మనిషి చేతిలాఘవంతో తీసికెళ్ల గలిగినవి

వ్యక్తులు తేలిగ్గా మోసుకువెళ్లలేని వస్తువులు.

బల్లలు—కుర్చీలు—టీ పాయ్—మంచాలు.

నలుగురయిదుగురు కలిసి సహకారంతో బయటికి ఈడ్చుకువెళ్లారు. పరుపులు దుప్పట్లు చుట్టలుచుట్టలుగా తెచ్చి కుప్పవేశారు పుస్తకాల బీరువాలోనున్న కూటికీ గుడ్డకూరాని పుస్తకాలు—దొంతరలు దొంతరులుగాతెచ్చి బయట కుప్పపై విసిరారు రేపటి రోజు పోలీసులు గుర్తుపట్టే వస్తువులు—కోట్లు—సూట్లు—టెన్నిస్ రాకట్ ఇత్యాదులు—తెచ్చి కుప్పపై గిరాటువేశారు.

చూస్తూచూస్తుండగానే ఇల్లంతా చిందర వందరగా తయారయిపోయింది చిరిగిన కాగితాలు—పగిలిన గాజుపెంకులతో నిర్జీవంగా తయారయింది. ఆంధ్రుల ఇల్లు లూటీ అవుతుందన్న వార్త ఆలస్యంగా అందిన వ్యక్తి ఆశగా లోనికి పరుగెత్తి ఏమీలేకపోవటం గమనించి పగిలిన ఫోటోలను మళ్లీ పగలకొట్టి తన నిరాశను కోపాన్ని వ్యక్తపరచు కొన్నాడు.

శవదహనానికి నిర్ణీతపద్ధతిలో చితిపేర్చినట్లు—తగలబడని వస్తువుల మధ్యమధ్య త్వరగా తగలబడే వస్తువులను పేర్చి పెట్రోలుపోసి అగ్గిపుల్ల గీచారు.

'భగ్గు'మని జ్వాల ఆకాశాని కెగసిపడింది.

నిస్సహాయుడై నిలబడి చూస్తూన్న వెంకటి కనుకొలకుల్లో రెండు కన్నీటిచుక్కలు తళుక్కున మెరిశాయి.

ఆంధ్ర ఉద్యోగి ఆస్తిపాస్తులు ఆ విధంగా భస్మీపటలమైపోతూంటే చూసి అందరూ ఆనందంతో కేరింతలు—చప్పట్లు కొట్టారు. ఆ జ్వాలల్లో ఇంటి యజమానిని సజీవదహనం చేసినంత సంతృప్తితో గృహోన్ముఖులై తిరిగి పోసాగారు. వస్తువులు ఎర్రగకాలి నుసిగామారి ఆకారాలు కోల్పోయాయి. మంటలలో పూర్తిగా కాలలేని ఇనప కుర్చీలు వగయిరా మూర్ఛలరోగిలా మెలికలు తిరిగి ముడుచుకుపోయి వికృతరూపాలు పొందాయి. పదిహేను సంవత్సరాలు కష్టపడి సంపాదించుకొన్న ఆస్తిపాస్తులు పదిహేను నిముషాలలో బూడిదకుప్పలా మిగిలిపొయ్యాయి.

## 4

వారం రోజులు గిర్రున తిరిగిపొయ్యాయి. కాలినబూడిద కుప్పకు రక్షణ కల్పిస్తూ ఇద్దరు పోలీసులు రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. ఇంటి యజమాని భార్యపిల్లలతోసహా ఎక్కడికి వెళ్లాడో అజాలయిపూలేరు. వెంకటి మనస్సు పరిపరివిధాల పోయింది యజమాని మిత్రులు, పరిచితుల ఇళ్లకు వెళ్ళి ప్రాధేయపడి అడిగాడు. ఎవరూ ఏ అచూకీ

తెలియపరచలేదు. నిస్పృహచెందిన వెంకటి ఆ రోజు సాయంత్రం ప్రక్కింటావిడవద్ద చేరాడు.

'అమ్మా...మా దొర కొరడుగిట్టా ఏసిం డమ్మా?'...కళ్లలో ఆవేదన ద్యోతకమౌతోంది.

'ఏసిందురా...ఎంకటీ...రా—రా - నిన్న మా ఇంటిముఖాన రాలేదు. గంత పురుసత్ లేకుండపోయిందేందిరో'...ఆమె ఆప్యాయతనిండిన కంఠంతో అడిగింది వాలుకుర్చీలో కూర్చొని.

'గక్కడ జిల్లా పరిషత్ థఫ్తర్లో ఆంధ్రోల్లందరినీ సేర్చి పోలీసు బందోబస్తులో ఉంచిన్రని ఎరికయి సిన్నగ కరీంనగరంపోయిన. గాడ సెక్రటీ కాడు— తురకాయన —ఆయన తాన మాబావ కొలువుంటాండుగద — మా బావ రికమండుతో లోనికెల్లి అందర్నీ ఎతికిఎతికి పరీచ్చగా సూసిన. అక్కడ సుత లేరు—ఎటుబోయిన్రో ఏందో'......అంటూ తలుపు వారగా కూలబడ్డాడు.

'బెజవాడ సేరిన్రంట'—

'గట్టనామ్మా...ఏం'కిరికిరి' లేకుండ సేరిన్రు గదా...రంఢిబాసె...మళ్లీ ఈడ కెన్నడు వత్తాన్రు'...

'ఏమో...గదేం రాయలేదు'... లాంఛనంగా సమాధానమిచ్చి వారపత్రిక పేజీలు తిప్పసాగింది—చెప్పవలసిన విషయాలు ఏమీ లేనట్లు.

'దారిలో పోరగాళ్లు గాఢీని ఆగబట్టి లొల్లిగిట్ట చెయ్యలేదంటనా?'...

'......' పత్రిక చదువుకోసాగింది.

'అమ్మా...నీ బాంచను...గా ఉత్తరం జర నాకు చదివి ఇనిపించండ్రి...అప్పుడు నాకు అన్నీ మనసున బడతయి...మళ్లీ మళ్లీ ఊకే, మిమ్ముల్నడిగితే మీకు సుతయాష్టకొస్తది'...

ఆమె పత్రికనుండి కళ్లు తిప్పి అతనికేసి చూసింది. అతని కళ్లలో కనిపిస్తున్న కుతూహలం, అంతర్వేదనను అర్థం చేసికొని చప్పున పత్రిక పక్కనపెట్టి ఉత్తరం విప్పి చదవసాగింది - బిగ్గరగా.

'మిత్రులు శ్రీయుత ప్రహ్లదరావ్‌గారికి,

రావ్‌సాబ్ —నమస్కారములు.

మేము క్షేమంగా విజయవాడ చేరుకొన్నాం— దారిలోకూడ ఏ ఆటంకాలు, ఆపదలూ లేవు. రైలు దిగటంతోనే శరణార్థులకు స్వాగతం చెబుతూ స్వచ్ఛంద సేవాదళాల వలంటీర్లు మా భోగీ చుట్టూ మూగారు. మూడు రోజులపాటు ఎంతో ప్రేమాభిమానాలతో మా యోగక్షేమాలు చూశారు. మేము వారికి ఎంతో ఋణపడి ఉన్నాం.

మేము బయలుదేరేప్పుడు మీతో చెప్పకుండ వచ్చినందుకు క్షమించగలరు. తెల్లవారుజామున నాల్గు గంటలకు ఇల్లు విడిచాం. మీకు నిద్రాభంగమెందుకు కలిగించాలనిచెప్పి మీ ఇంటికి రాలేదు. చేలకు అడ్డంపడి నడిచి తెల్లవారేసరికి ఈశ్వరరెడ్డిగారి ఊరు చేరాము. కోరిన వెంటనే ఆశ్రయమిచ్చి కంటికి రెప్పలా చూశారు. రెండవరోజు వారి జీప్‌లో కాజీపేట చేర్చారు.'

'పాపం...దొరసాని గంతదూరం ఎట్టా నడిసిందో ఏందో'...తనలో తాను అనుకొన్నాడు వెంకటి. ఆమె అతని మాటలు పట్టించుకోక ఉత్తరం చదువుకు పోసాగింది.

'మా ఇల్లు తగులబెట్టటాన్నిగూర్చి పత్రికలో చూశాను...ఏమీ మిగల లేదనుకొంటాను... ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క వస్తువు చొప్పున ఆ ఇంటిలో చేర్చాను ఒక సంవత్సరం రేడియో— మరో సంవత్సరం మరొకటి - ఈ రకంగా కొన్నాను. ఆ డబ్బు మిగుల్చుకోటానికి నేనెంత కష్టపడ్డానో మీకు తెలుసు. చిట్టీలుకట్టి— పరీక్షలకు వెళ్లిన రెమ్యూనరేషన్ పోగుచేసి, అనేక విధాల పోగుచేసి ఆయా వస్తువులు కొన్నాను.

'ఇక మా ఆవిడంటారా? నెత్తినోరు కొట్టుకొని ఏడుస్తోంది—పచ్చి మంచినీళ్లు ముట్టుకోకుండ. ఆ రోజు రాత్రి ఆమె నగలు వెంట తెచ్చుకొంటానన్నది కానీ, నేనేవద్దని వారించాను. నా తెలివి తక్కువతనంవల్లనే అవి అగ్నికి ఆహుతి అయిపొయ్యాయి.

'నావి నాకు కాకుండ పొయ్యాయని ఇప్పుడు బాధలేదు ఎందుకంటే ఇక్కడ చేరిన శరణార్థులను

చాలామందిని చూశాను. తలగొరిగిన వాళ్ళు, ఒక మీసం గొరిగిన మగవాళ్ళు—కనుబొమలు—సిగలు తరిగిన అక్కచెల్లెళ్లను ఇంకా ఎందరో వికృతరూపులను చూశాను. 'మీకు ఏ విధంగా అవమానం జరిగిందని' ప్రశ్నించినప్పుడు—పెదవి విప్పి చెప్పలేక గుడ్లలోనీరు గుడ్లలో కుక్కుకొని, నా ప్రశ్నకు సమాధానంగా దీనంగా నా కళ్ళలోకి చూసిన స్త్రీమూర్తుల మూగ ఆక్రందన విన్నాను. ఆలాటి దుర్గతి మాకు కల్పించని మీ ఊరి ఆందోళనకారులకు మనస్సుల్లోనే కృతజ్ఞత తెలుపుకొని నిర్విచారంగా వుంటున్నాం.

'దాదాపు రెండు దశాబ్దాల క్రితం తెలంగాణా గడ్డపై మతంపేరిట జాతిపేరిట మారణహోమం జరిగింది. అప్పటి మానభంగాలు—గృహదహనాలు—లూటీలు - కిరాతకచర్యలు—వికలాంగుల రోదనలూ పీడకలగా భావించాం. మన చరిత్రలో ఆ రక్తపు మరకలు ఇంకా పూర్తిగా మాసిపోకముందే మరో హింసాకాండ మొదలైంది. ఇది గతించినదానికి పూర్తిగా విరుద్ధం. నేడు ఒకేజాతి—ఒకేభాష - ఒకే మతం—ఒకే సంస్కృతి ఆచారాలు కల్గిన ఏకోదరులు పరస్పరం ద్వేషించుకొని హింసించుకొంటున్నారు. ఇది ఎంత అవివేకం.

'నిజంగా ఆంధ్ర సోదరులపై జమీకింత పగ ద్వేషం గూడుకట్టుకొని ఉన్నాయని నే నెప్పుడూ ఊహించలేదు. పన్నెండు సంవత్సరాలుగా మీ గుండెల్లో పేరుకొన్న అసంతృప్తి ఈ చర్యలద్వారా ఉపశమించిందనుకొంటాను.

'మార్వాడీ మిఠాయి వెళ్లిపో'

'బాంబే హల్వా వెళ్లిపో'

'సిక్కుగడ్డం వెళ్లిపో'

'మద్రాసు సాంబారు వెళ్లిపో' అని మీరు నినాదాలు చెయ్యలేదు.

'ఆంధ్ర - గోంగూర వెళ్లిపో' అని మాత్రమే అన్నారు. దీనికి పూర్తిగా మేం బాధ్యులం. ఇన్ని సంవత్సరాలుగా తెలంగాణా వాయువులు పీలుస్తూ ఇక్కడి ఉప్పుపులుసూ తింటూ మీలో కలిసిపోలేక పోయ్యాం. కానీ ఈ నేరానికి మీరు విధించిన శిక్ష చాలా పెద్దది. ఇక్కడినుంచివచ్చిన ఉద్యోగులు చాలామంది మీకు అధికారులుగా ఉన్నతాధికారులుగా వచ్చారు. మీకు ఇంగ్లీషుభాషా పటిష్టతలేదని, మీకు ఆఫీసుపని తెలియదని మీ మనస్సు నొప్పించారు

నాకు తెలుసు

'వెధవలకు ఒక్కఇంగ్లీషుమాటకు సరిగా స్పెలింగ్ రాదు—ఏం డ్రాఫ్టింగయ్యా?...ఇంతేనా నోట్ పుటప్‌చెయ్యటం?...ఇంకా అనేకవిధాలుగా మిమ్మల్ని వెక్కిరించి హేళనపరిచిన ఉదంతాలు నాకు తెలుసు. ఆంధ్రులు బ్రిటిష్‌వాళ్ల బానిసత్వంలో నేర్చిన రూలు—రూలుక్రింద సబ్‌రూలు—జీ. వో. దానికొక అనుబంధం మొదలైన అంశాలతోకూడిన బ్రహ్మాండమైన 'రెడ్‌టేపిజమ్'తో మనలను సతాయించుతున్నారని మాత్రమే మీరు బాధపడ్డారుగానీ శ్రద్ధగా పనిలో సామర్థ్యం సంపాదించలేకపొయ్యారు దీనికి కారణం మన బానిసత్వ వారసత్వం.

ఒకరు తెల్లవాడి బానిస. మరొకరు నైజాం నావాబు గులాం. ఒకరు రాజభాషగా ఇంగ్లీషు నేర్చుకొని ఈమూలనుండి ఆమూలకు వ్రాసేవాడు. మరొకరు రాజభాషగా 'ఉర్దూ' నేర్చుకొని ఆమూల నుండి ఈమూలకు ఎదురు వ్రాసేవాడు. 'సర్దార్ పటేల్ పుణ్యమా' అని వీరిద్దరూ సరిహద్దులు చెరుపుకొని 'ఆంధ్రప్రదేశ్'గా పరిధులు గీచుకొన్నా ఇంత త్వరగా మనుషులు మారటం కష్టం. విభిన్న దాస్యం ఫలితంగా పరిపాలకుల సంస్కృతి వారివారి జాతి జీవిత విధానాలు మనలో జీర్ణించుకుపొయ్యాయి. వాటిని ఛేదించుకొని మనం 'మనంగా' మిగిలిపోవటానికి దాదాపు ఒక శతాబ్దం పట్టవచ్చు. అప్పటివరకు ఈ అపోహలు పోవు'......

గోడవారగా కూర్చొని వింటున్న వెంకటి పెద్దగా ఆవులించి కనురెప్పలు బలంగా తెరిచాడు. ఆమె తల పైకెత్తి అతనికేసిచూసి, కోపంగా కొన్నిపేరాలు స్కిప్‌చేసి మళ్లీ ఉత్తరం చదవసాగింది.

'ఇక మళ్ళీ మేం తిరిగి అక్కడికి రావటం గూర్చి—జరిగిన పొరపాటుకు చింతిస్తున్నామని తిరిగి ఉద్యోగంలో ప్రవేశించవలసినదని మీ జిల్లానుంచి వచ్చిన సుహృద్భావసంఘనాయకులు పలికారు. కానీ ఈ వేళ రమ్మని తీసుకువెళ్ళి ఎవరి స్థలాల్లో వారిని విడిచి నాయకులు తమతమ పనుల్లో మునిగి పోతారు. విద్యార్థులుకానీ విద్యార్థులపేరు చెప్పుకొని బహాటంగా మీసాలు మెలివేసికొంటూ తిరిగే నాయకులు మమ్మల్ని మళ్ళీ బెదిరించవచ్చు. తిరిగి వచ్చిన అపరాధానికి దారుణంగా శిక్షించవచ్చు. నాలుగు జీతపురాళ్ళపై బెరుకుబెరుగ్గా రెండు పాఠాలు చెబుతూ భయంభయంగా సంచరించటం నిత్యనరకం. డబ్బు లేకపోయినా బ్రతకవచ్చుకానీ ప్రేమలేని మనుషులమధ్య బ్రతకటం కష్టం

'పోలీసు కాపలా పెట్టుకోమంటారు—అంతేనా?'

పోలీసు కాపలాతో ఎన్నాళ్ళు మనుగడ. అది ఒక మంత్రులకే సరిపోయింది. ఏ ఇంటిముందు చూసినా ఉక్కుశిరస్త్రాణాలు ధరించిన సాయుధ బలాలు మందలుమందలుగా పహరా తిరుగుతున్నాయి. మంత్రులకే అంత భయం ఉన్నప్పుడు సామాన్య మానవుడనైన నేను—కేవలం సుహృద్భావసంఘ నాయకుల హామీపై తిరిగి అక్కడికి రావటం అంత మంచిదికారు (అయితే వస్తానని వాళ్ళకు మాట ఇచ్చాననుకోండి.)

ప్రస్తుతానికి ఒక ప్రెస్‌లో ప్రూఫ్‌రీడర్‌గా చేరాను. నెలకు ఎనభై రూపాయల జీతం. ఇప్పుడు అంతస్తుహోదాపేరిట ఇంట్లో లేనిపోని సరంజామా కూర్చుకోవాల్సినపనిలేదు. అంతా సామాన్యమైన బ్రతుకు. రెండు కుండలు—రెండు వంటపాత్రలతో సంతృప్తిగా జీవిస్తున్నాం. మళ్ళీ జీవితంలో నిత్యాన సరాలపేరిట, రేడియో—ఫాను—పేంకుర్చీలు కొనాలనే వెర్రివ్యామోహం పూర్తిగా చచ్చిపోయింది. ఒక కొత్తరకం జీవితవైఖరి చూపిన ఉద్యమకారులకు నా కృతజ్ఞత.

ప్రస్తుతం ఒక చిన్నతాటాకుల ఇంటిలో ఉంటున్నాం. రానున్నది వేసవికాలం. వేసవికాలం వచ్చిందంటే ఈ విజయవాడలో గుండెమీద చెయ్యి వేసుకొని నిద్రబోవటం కష్టం. ఏటేటా గృహ దహనాలు—సినిమాతార వయస్సులా మారని సత్యం అందువలన రెండుజతల బట్టలు చాలు—మనిషికి.

మిత్రు లందరికీ నా నమస్కారములు మీ పిల్లలకు నా ఆశీస్సులు. మీ జాబుకోసం ఎదురు చూస్తూంటాం. భవదీయుడు.

కె. దయాకర్‌రావ్.

'విన్నావ్ కాదురా !...మనసున పట్టిందా?... ఇంకా ఏందో సోచా యిస్తున్నావ్' ఉత్తరం ముగించి మడిచి కవరులో పెట్టి వెంకటికేసి తిరిగి అంది.

'.........' మారుమాట్లాడక కళ్ళప్పగించి అలానే చూస్తూండిపొయ్యాడు. కళ్ళల్లో గిర్రున నీరు తిరిగింది. తల దించేసుకొన్నాడు.

'గింత ఘనం దొరకోసం నేను 'పరేశాన్'అయి తిరుగుతాన్న—మా ఎంకటిగాడు మంచిగ ఉన్నాడా?... లేదా?' అని దొర రాయలేదు సూసిన్రా...గొప్పోల్లు గొప్పోల్లు ఒకటి...మాలాటి గరీబుగాళ్ళు ఎవల్లకు యాద్ కుండరు.'

దుఃఖంతో కనురెప్పలు వాలిపొయ్యాయి.

ఆ స్వామిభక్తి పరాయణతకు ఆమె విస్తుపోయి అలానే అతని ముఖంకేసి చూడసాగింది. ఆ అల్పమనస్సును ఎలా సంతృప్తిపరచాలో తోచలేదు.

'మంచిదమ్మా...నే పోతాన్నా' ... లాంఛనంగా అని చిన్నపోయిన ముఖంతో, నీరసంగా కాళ్ళీడ్చుకొంటూ ఇంటివైపు నడక సాగించాడు.

సాయంకాలపు ఎండ వెలవెలబోతోంది—జనవరి అఖిలపక్షబంధంలా. విజయవాడ పారిపోతూన్న ఆంధ్ర ఉద్యోగిలా, పశ్చిమ పరిహద్దుల్లోకి పారి పోతున్నాడు దినకరుడు.